## పోలీస్ వాహనం ఢీకొని ఏఎస్సై మృతి



**అక్షరటుడే, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పోలీస్ వాహనం ఢీకొని ఏఎస్సై మృతి చెందారు. సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. మానూర్ పోలీస్ స్టేషన్‌లో గోవింద్ నాయక్ ఏఎస్సైగా పని చేస్తున్నారు. సోమవారం రాత్రి ఆయన విధుల్లో ఉన్న సమయంలో హోంగార్డు రామారావు నడుపుతున్న పోలీసు వాహనం అదుపుతప్పి ఢీకొంది. ప్రమాదంతో ఏఎస్సై గోవింద్ నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తోటి సిబ్బంది వెంటనే ఆయనను నారాయణఖేడ్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. ఏఎస్సై చనిపోయారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN



## ప్రభుత్వానికి బుద్ధి రావాలి:కవిత



**అక్షరటుడే, హైదరాబాద్ :** అంబేడ్కర్ అంటేనే ధైర్యం అని, ఆయనిచ్చిన ధైర్యంతో పేదవాళ్లకు న్యాయం చేసేలా ప్రభుత్వంపై పోరాటం చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ భూమి మీద ఎవరైనా యాంటీ అంబేడ్కర్ ఉన్నారంటే అది రేవంత్ రెడ్డి మాత్రమేనని విమర్శించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా కవిత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆయన సాధారణ వ్యక్తి కాదని, ఒక ఐడియాలజీ అన్నారు. ఆయన జయంతి సందర్భంగానైనా ఈ ప్రభుత్వానికి బుద్ధి రావాలన్నారు.


14-4-2026 (Tuesday) MAIN EDITION


### క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్ ప్రారంభం



అక్షరటుడే, ఏపీ: దేశంలోనే తొలి క్వాంటం కేంద్రమైన 'అమరావతి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీస్'ను సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం వర్సిటీలో ఓ ఫెసిలిటీ, గన్నవరంలోని మేధా టవర్స్‌లో మరొకటి ఆవిష్కరించారు. టెస్ట్ బెడ్స్ ద్వారా క్వాంటం కంప్యూటింగ్ ఉపకరణాలను పరీక్షించే సదుపాయం అందుబాటులోకి రానుంది.

### ఎయిర్‌పోర్టులో పేలిన సెల్‌ఫోన్ బ్యాటరీ



అక్షరటుడే, హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడి బ్యాగ్‌లో సెల్‌ఫోన్ బ్యాటరీ పేలింది. రాయ్‌పూర్ వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఓ ప్రయాణికుడు వచ్చాడు. అతడి లగేజీని సీఐఎస్ఎఫ్ సిబ్బంది తనిఖీ చేస్తుండగా ఫోన్ బ్యాటరీ పేలింది. దీంతో అక్కడున్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

### ఉగ్ర కుట్ర భగ్నం.. 11 మంది అరెస్ట్



అక్షరటుడే, ఏపీ: విజయవాడ కేంద్రంగా సాగుతున్న ఉగ్ర నెట్వర్క్ ను పోలీసులు ఛేదించి 11 మందిని అరెస్ట్ చేశారు. ఆఫ్ఘనిస్థాన్ కు చెందిన అల్ హకీం షుకూర్ మార్గదర్శకత్వంలో యువతను ఉగ్రవాదం వైపు మళ్ళ పెడుతున్నట్లు గుర్తించారు. వీరికి అల్ ఖైదా, ఐసిస్ వంటి నిషేధిత సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు.

## రైతు భరోసా వచ్చేనా.. రెండో విడతపై స్పష్టత కరువు

**అక్షరటుడే, హైదరాబాద్:** యాసంగి సీజన్ ముగింపునకు వచ్చింది. వరి కోతలు జోరందుకున్నాయి. అయినా కూడా రైతు భరోసా పూర్తిస్థాయిలో అన్నదాతల ఖాతాలో జమ కాలేదు. సీజన్ ముగుస్తున్నా డబ్బులు రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాసంగి సీజన్‌కు సంబంధించి తొలి విడత డబ్బులను మార్చి 22న సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. ఎకరంలోపు ఉన్న రైతులకు మొత్తం నిధులు జమ చేశారు. ఎన్ని ఎకరాలున్నా రూ.6 వేలే వేశారు. మిగతా డబ్బులను రెండో విడతలో 20 రోజుల్లో జమ చేస్తామని చెప్పారు. ఈ లెక్కన ఏప్రిల్ 12లోపు డబ్బులు వేయాలి. కానీ ఆ గడువు ముగిసినా రైతు భరోసా గురించి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయడం లేదు. దీంతో అసలు డబ్బులు వేస్తారా లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## సీపీ సజ్జనార్‌ను కలిసి ఫిర్యాదు చేసిన మంగ్లీ

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** ప్రముఖ సినీ గాయని మంగ్లీ మైక్రో ఫైనాన్స్ వివాదం కేసు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో ఆమె నగర సీపీ వి.సి. సజ్జనార్‌ను కలిశారు. తనపై సోషల్ మీడియాలో, ఇతర వేదికల ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంపై ఫిర్యాదు చేశారు. ఎటువంటి ఆధారాలు లేకుండా అడ్వకేట్ సుబ్బారావు అనే వ్యక్తి తనపై దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని, దీనివల్ల తన వ్యక్తిత్వానికి భంగం వాటిల్లుతోందని వివరించారు. ఉద్దేశపూర్వకంగా తనను అసత్య ఆరోపణలు చేస్తున్న అడ్వకేట్ పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



**కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదించిన ప్రకారం నియోజకవర్గాల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్ ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించి సమాజంలో సమాన విలువ, గౌరవం కల్పించిన నాయకుడు అంబేద్కర్ అన్నారు. మహిళా రిజర్వేషన్లతో నియోజకవర్గాల పెంపును ముడిపెట్టి కలగాపులగం చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్‌ప్రతినిధి**

# దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

**■ నియోజకవర్గాల పునర్విభజనపై సీఎం రేవంత్‌రెడ్డి ■ అంబేద్కర్‌కు ఘన నివాళి ■ ఆయన స్ఫూర్తితోనే తెలంగాణ ఏర్పాటు**

మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోందని సీఎం విమర్శించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పెంపు అని మొదట ప్రస్తావించారని, అభివృద్ధి చెందిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని అభ్యంతరం వ్యక్తం చేస్తే దామాషా ప్రకారం 50 శాతం పెంచుతామని అంటున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాతిపదిక ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరాలను పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాదిలో సీట్లు తగ్గడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వుడు సీట్లు తగ్గుతాయన్నారు.

### అభ్యంతరం లేదు

మహిళా రిజర్వేషన్ల పెంపుపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని సీఎం అన్నారు. మంచి పనికి తెలంగాణ ప్రభుత్వం ముందుంటుందని పేర్కొన్నారు. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి చెప్పిన మాటలు ఆచరణలోకి రావాలంటే మన సీట్లను సాధించుకోవాలన్నారు. అప్పుడే హక్కుల కోసం మాట్లాడగలమని చెప్పారు.

### రెండు కళ్లలాంటి వారు

రక్తం చిందించకుండా శాంతితో యుద్ధాన్ని గెలవొచ్చని మహాత్మాగాంధీ ప్రపంచ దేశాలకు చాటిచెబితే, ఆ దేశాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా పరిపాలించవచ్చని నిరూపించిన వ్యక్తి అంబేద్కర్ అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ దేశానికి గాంధీ, అంబేద్కర్ రెండు కళ్లలాంటి వారన్నారు. రాజ్యాంగంలో అంబేద్కర్ జోడించిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో ఇచ్చిన 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లలో అత్యధికంగా దళితులకు ఇచ్చామని వెల్లడించారు.

## రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ కుట్ర: భట్టి



**అక్షరటుడే, హైదరాబాద్:** భారతీయ జనతా పార్టీ రాజ్యాంగాన్ని మార్చడానికి, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. దీంతో ప్రజలు తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జై భీమ్ నినాదంతో రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి ప్రజలు ఏకం కావాలన్నారు. బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అంబేడ్కర్ దేశంలో జన్మించడం మన అదృష్టమన్నారు.

## రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలి: జీవన్‌రెడ్డి




**అక్షరటుడే, హైదరాబాద్:** రేవంత్‌రెడ్డి పోవాలి.. కేసీఆర్ అధికారంలోకి రావాలి అన్నదే తన నినాదం అని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. అధికార పార్టీని వదిలి.. ఆత్మగౌరవం కోసం బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. జీవన్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన ఈ నెల 20న బీఆర్ఎస్‌లో చేరనున్నారు. ఈ సందర్భంగా భారీ సభ నిర్వహిస్తున్నారు. ఈ సభకు కేసీఆర్ సైతం రానున్నారు. ఈ క్రమంలో సభ విజయవంతం చేయాలని జీవన్‌రెడ్డి అనుచరులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీలో తన చేరికతో నూతన అధ్యాయం మొదలు కాబోతుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్‌తో తన అనుబంధం ఈనాటిది కాదని జీవన్‌రెడ్డి అన్నారు. ప్రజా జీవితంలోకి రాక ముందు నుంచే కేసీఆర్ వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా తనకు పరిచయం అని చెప్పారు.

## తమిళనాడు బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** తమిళనాడు శాసనసభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ తన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ మేనిఫెస్టోను ఆవిష్కరించారు. పొంగల్, తమిళ నూతన సంవత్సరం, దీపావళి పండుగల సమయంలో మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లను అందిస్తామని ప్రకటించింది. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల నగదు సహాయం, ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసే మహిళలకు రూ.25 వేల రాయితీ ఇస్తామని హామీ ఇచ్చింది. తైపూసం పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తామని, తిరుప్పరంకుండ్రం వద్ద సంప్రదాయ దీపాన్ని వెలిగించే ప్రాచీన ఆచారాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించింది. తమిళనాడులోని పది నగరాలను దేశంలోని అగ్రశ్రేణి 100 "చెత్త రహిత నగరాల" జాబితాలో చేర్చుతామని పేర్కొంది.

## సినిమాల్లోకి నివేదా పేతురాజ్ రీఎంట్రీ..!



**తన అందం అభినయంతో ఆకట్టుకున్న నటి నివేదా పేతురాజ్. ఈ బ్యూటీ ప్రేక్షకుల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. మెంటల్ మదిలో సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ అమ్మడు చిత్రలహరి, బ్రోచేవారెవరురా, అల వైకుంఠపురములో`, దాస్ క ధమ్కీ వంటి సినిమాలు మంచి పేరు తెచ్చి పెట్టాయి. అయితే పెళ్లి చేసుకోవాలని భావించి సినిమాలకు దూరమైంది. దుబాయ్‌కి చెందిన వ్యాపారవేత్తతో నిశ్చితార్థం కూడా జరిగింది. అయితే ఈ పెళ్లి క్యాన్సిల్ అయిందని తెలుస్తోంది. దీంతో తన సెకండ్ ఇన్నింగ్స్ కోసం సిద్ధమవుతోంది. అవసరమైతే సెకండ్ హీరోయిన్ క్యారెక్టర్‌లకు సైతం ఓకే చెప్పేయాలనే ఆలోచనతో ఉందని తెలుస్తోంది. తెలుగులోనూ ప్రయత్నాలు మొదలు పెట్టినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి.**

**–అక్షరటుడే, సినిమా డెస్క్**

## సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి: పొన్నం



**అక్షరటుడే, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, కార్మిక సంఘాలకు సంబంధించిన అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రెండు అంశాలు తప్ప మిగతా సమస్యలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇటీవలే ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ అమలులోకి తీసుకువచ్చామని తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి డీఏ బకాయిలు పెండింగ్‌లో లేవన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ అంశం కూడా ఆలోచిస్తున్నామని తెలిపారు. సంస్థ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

## మే 1 నుంచి తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు!



**అక్షరటుడే, తిరుమల :** వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో రద్దీ పెరిగే అవకాశం ఉంది. దీంతో మే 1 నుంచి వీఐపీ దర్శనాలతో పాటు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లను రద్దు చేయాలని టీటీడీ యోచిస్తోంది. వైకుంఠ ఏకదాశి సమయంలో అనుసరించిన విధానాన్ని అమలు చేసి ఎక్కువ మంది సామాన్య భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించాలని చూస్తున్నారు. ఈ మేరకు గత మూడేళ్లలో వేసవిలో భక్తుల రద్దీ వివరాలు విశ్లేషిస్తున్నారు. ఈ లెక్కల ప్రకారం మే, జూన్, జులై నెలల్లో ప్రతినెలా సగటున 23 24 లక్షల మంది భక్తులు తిరుమలకు వస్తున్నారు. ప్రస్తుతం వీఐపీ దర్శనాల కోసం రోజుకు 2 నుంచి 3 గంటల సమయం కేటాయిస్తున్నారు. ఆ సమయంలో 3,800 మంది వీఐపీలు మాత్రమే స్వామి వారిని దర్శనం చేసుకుంటున్నారు. అదే సమయాన్ని సామాన్యులకు కేటాయిస్తే 15 వేల మంది స్వామి వారిని దర్శించుకునే వీలు అవుతుంది. దీంతో వేసవిలో రద్దీ నేపథ్యంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయాలని టీటీడీ అధికారులు ఆలోచిస్తున్నారు.